క్లుప్తంగా

పెదబోరబందలో 'గడప గడపకు' రేపు

సాలూరు: మండలంలోని బోరబంద సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పాల్గొననున్నారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మంగళవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

సారా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం



పట్టణ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వేలం పాట

సాలూరు: పట్టణం, మండల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్ల ఆవరణల్లో మంగళవారం వేలం పాట నిర్వహించినట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి వేర్వేరుగా తెలిపారు. పట్టణ స్టేషన్ పరిధిలో పట్టుకున్న 14 వాహనాలకుగాను 10 వాహనాలు, రూరల్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న 13 వాహనాలకుగాను రెండు వాహనాలను వేలంలో కొనుగోలు జరిగాయని వారు తెలిపారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ గోవిందరావు

పార్వతీపురం టౌన్: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను డోకిశీల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ గోవిందరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో విద్యార్థులను ఎంపిక చేశామని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ ఎం.వాసుదేవరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ సేవలు

- సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి



బి.వాగ్దేవి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో బుధవారం నుంచి ఎంప్లాయీ హెల్త్ స్కీం(ఈహెచ్‌ఎస్) వైద్యసేవలు అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఔట్‌పేషెంట్ సేవలు అందిస్తామని తెలిపారు. డిస్పెన్సరీ విభాగంలో సేవలు అందుతాయని, ఇందులో కన్సల్టేషన్, డయాగ్నొస్టిక్స్, మందులు అందిస్తారని, రిఫర్ సేవలపై హైఆస్పత్రులకు పంపిస్తారని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షల విలువ వరకు ప్యాకేజీ అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈహెచ్‌ఎస్‌లో సెప్టెంబర్ నెలలో ఆయా తేదీల్లో వైద్యం అందించే వైద్యుల వివరాలు సిద్ధం చేశామన్నారు.

తెగులు నివారణకు జాగ్రత్త పాటించాలి



వరిచేనులో మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వరి ఉభాలు పూర్తయి చేను ఏపుగా పెరగడంతో వరి పంటపై ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎస్. అవినాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన జోగింపేట, సీతానగరం, చినభోగిలి, చెల్లన్నాయువలస గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిచేలు ఏపుగా పెరగడానికి వాతావరణం అనుకూలించిందని, పంటలపై వచ్చే తెగుళ్లను ఎదుర్కోడానికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరిచేను పంటపై అగ్గి తెగులు, పాడతెగులు సోకినట్లు గుర్తించామని చెప్పారు. ఆయా తెగుళ్ల నివారణకు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు మందుద్రావణాన్ని పిచికారీ చేయాలని స్పష్టం చేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీలో కొత్తగా పింఛన్లు మంజూరైన 16 మంది లబ్ధిదారులకు గ్రామ సచివాలయ కన్వీనర్ తోయక మాధవరావు, ఎంపీటీసీ మండంగి గౌరమ్మ మంగళవారం పంపిణీ చేశారు.

బోధనలో ఆటంకానికి సెల్లు

- తరగతి గదుల్లో మొబైల్ వాడకం నిషేధం
- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ కమిషనర్
- డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలకు పర్యవేక్షణ బాధ్యతలు



తరగతి గదిలో అభ్యసిస్తున్న విద్యార్థులు

పార్వతీపురం:

దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుంది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన అవసరం ఉంది. అయితే ఇటీవల మానవ జీవితంలో భాగమైన స్మార్ట్ ఫోన్లను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో వాడడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రప్రభావం పడుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వాడరాదని ప్రధానోపాధ్యాయులు పదేపదే చెబుతున్నారు. తరగతి గదుల్లో ఫోన్ ఉపయోగించడం వల్ల విద్యాబోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వాడకంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా తరగతి గదుల్లో సెల్‌ఫోన్ల వాడకంపై చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్‌జేడీ, డీఈఓ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



ఏకాగ్రత దెబ్బతింటుంది

జిల్లావ్యాప్తంగా 1,722 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 6,487 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో బోధన సమయంలో ఎటువంటి ఆటంకం రాకుండా, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాఠ్యాంశాల మీదనే పూర్తి ఏకాగ్రత కేంద్రీకరించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా వ్యక్తిగత అవసరాలకు మొబైల్ ఫోన్లను ఉపయోగించడం వల్ల బోధనా సమయం వృథా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కూడా సెల్‌ఫోన్లను తీసుకు రావడడంతో పాఠశాలల్లో క్రమశిక్షణ దారి తప్పుతోంది.

హెచ్‌ఎం అనుమతితో

ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన వెంటనే యాప్‌లో ఫేస్ అటెండెన్స్ నమోదు చేయాల్సి ఉంది. అనంతరం వారి ఫోన్లను ప్రధానోపాధ్యాయుడి గదిలో లేదా పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ (గుమాస్తా) వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అత్యవసరమైతే హెచ్‌ఎం అనుమతితో మొబైల్ ఫోనును ఉపయోగించాలి. తరగతి గదుల్లో విద్యాబోధన కోసం ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయుడు ఉదయం పాఠశాల పనివేళలకు ముందు, పనివేళల తర్వాత మాత్రమే మొబైల్స్ వినియోగించాలి. ఒకవేళ అటెండెన్స్ తీసుకోవడం ఆలస్యమైతే సంబంధిత హెచ్‌ఎం అనుమతితో సెల్‌ఫోన్ల ను వినియోగించాలి. ఉపాధ్యాయుడు నిబంధనలు అతిక్రమించి తరగతి గదిలో ఫోన్ వినియోగించిన ట్లు మొదటిసారి గుర్తిస్తే ఇక ముందెన్నడూ ఫోన్‌ను వినియోగించనని సంబంధిత పాఠశాల ఉన్నతాధికారికి రాతపూర్వక హామీ ఇవ్వాల్సి ఉంటుంది. రెండవసారి కూడా తరగతి గదిలో అనుమతి లేకుండా ఫోన్ వినియోగిస్తే మొబైల్ ఫోన్‌ను హెచ్‌ఎం తీసుకుని పాఠశాల ముగిసే వరకు హెచ్‌ఎం వద్ద ఉంచుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆ విషయాన్ని మండల విద్యా శాఖాధికారి దృష్టికి హెచ్‌ఎం తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. సంబంధిత ఉపాధ్యాయుడు మొబైల్ ఫోన్ నిబంధనలు పాటించని విషయాన్ని తెలియజేస్తూ ఎంఈఓ హెచ్చరిక జారీ చేస్తారు. మూడవసారి కూడా నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత ఉపాధ్యాయుడి మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి హెచ్చరిక అనంతరం ఆ విషయాన్ని ఉపాధ్యాయుని సర్వీస్ రిజిస్టర్‌లో రాసిన తరువాత ఫోన్‌ను తిరిగి ఇస్తారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు వినియోగించకుండా ప్రధానోపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణ చేయాలి. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసు ద్వారా తెలియపర్చాలి. నిబంధనలు అతిక్రమించి ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను వినియోగిస్తే దానికి హెచ్‌ఎంలను బాధ్యులను చేస్తారు.

నిబంధనలు పాటించాలి..

ఉపాధ్యాయుడు బోధనకు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాలని భావిస్తే, దాని ప్రయోజనం కచ్చితంగా నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ఆమోదం తీసుకోవాలి. మొబైల్ ఫోన్ వినియోగం ఎందుకో విద్యా లక్ష్యాల ఆధారంగా స్పష్టంగా పేర్కొనాలి. అకడమిక్ లేదా నాన్ అకడమిక్ ప్రయోజనం కోసం తరగతి గదికి ఫోన్‌ను తీసుకు వెళ్లాల్సి వస్తే సరైన కారణాన్ని పేర్కొని, ప్రధానోపాధ్యాయుడి అనుమతి తీసుకుని, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేయాలి.

ఉత్తర్వులు కచ్చితంగా పాటించాలి



పాఠశాలల్లో సెల్‌ఫోన్‌లను ను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు పాఠశాలలకు చేరవేశాం, బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా సాగడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగం వల్ల బోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలి.

–ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

ఎంపీటీసీని పరామర్శించిన డిప్యూటీ సీఎం



ఎంపీటీసీ వెంకట్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ ఎంపీటీసీ సామంతుల వెంకట్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యచికిత్స అవసరమైతే తనకు చెప్పాలని సూచించారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకుండా వైద్యసేవలు పొందాలన్నారు. పరామర్శించిన వారిలో మావుడి శ్రీనివాసరావు, రంగునాయుడు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



రచ్చబండను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుదురువాడ పంచాయతీ సంగందొర వలస గిరిజన గ్రామాన్ని మంగళవారం ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రచ్చబండను ప్రారంభించారు. గతంలో ఆ గ్రామంలో ఎమ్మెల్యే నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలందరూ తమకు రచ్చబండ కావాలని కోరగా వెంటనే నిధులు మంజూరు చేయడమే కాకుండా వారి ఆశయం నెరవేరుస్తూ సకాలంలో రచ్చబండ నిర్మాణం పూర్తి చేయించిన ఎమ్మెల్యేకి గ్రామప్రజలందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి శేఖర్, గ్రామ సర్పంచ్ అర్లప్ప, ఎంపీటీసీ వివిధ గ్రామాల సర్పంచ్‌లు సూరయ్య, యర్రప్ప, సుందర రావు, గణేష్, ఎస్.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సోషల్ మీడియా సమావేశానికి సర్వం సిద్ధం

నియోజకవర్గం స్థాయి సోషల్ మీడియా సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, పార్టీ పెద్దలు ముఖ్య అతిథులుగా ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. ఈ సమావేశం లయన్స్ కల్యాణ మండపం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని నియోజకవర్గ పరిధిలో గల మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వారియర్స్, ప్రజా ప్రతినిధులందరూ పాల్గొంటారని వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు సిద్ధం కావాలి



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్

పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు సిద్ధం కావాలని వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. ఈ మేరకు ఈ నెల 30న ప్రారంభమయ్యే జగనన్న సురక్ష క్యాంపులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావుతో కలిసి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాలో గల ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు ప్రతి గ్రామంలో ముందుగా చేయాల్సిన స్కానింగ్ గురించి దిశానిర్దేశం చేశారు. 30వ తేదీ నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు కావాల్సిన సన్నాహక చర్యలు ముందుగానే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలందరూ ఈ క్యాంపులను వినియోగించుకునేలా అవగాహన పెంచాలని సూచించారు.

క్షయ నిర్ధారణలో జాప్యం కూడదు

క్షయరోగ నిర్ధారణలో జాప్యం ఉండరాదని జాయింట్ డైరెక్టర్ ఆదేశించారు. జిల్లా క్షయ నివారణ విభాగంతో సమీక్షా సమావేశం నిర్వహించి క్షయవ్యాధి నిర్ధారణలో జాప్యం లేకుండా చూసుకోవాలని, అలాగే ప్రతి క్షయ రోగి మందులు తప్పనిసరిగా వాడేలా చూడాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా కెల్ల పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధవళ భాస్కరరావు, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటికి నేలకు సమతౌల్యం అవసరం



ఉభాలు పూర్తిచేసిన పంటపొలాలు

బలిజిపేట: సాగునీటి వినియోగం సమతౌల్యంలో ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటకు నీరు ఎక్కువ అయినా, ఎద్దడి తలెత్తినా దిగుబడి, భూసారంపై ప్రభావం చూపుతుంది. నీరు, భూములకు ఉండే సహజ లక్షణాలను గుర్తించి ఏభూమిలో ఏనీటితో పంటలను పండించాలనేది రైతులు అవగాహనతో మెలగాలని అధికారులు చెబుతున్నారు.

నీటి వినియోగం ఇలా ఉండాలి

ఎకరా వరిపంటకు 1,250మిల్లీ మీటర్ల నీరు అవసరం ఉంటుందని అంచనా. పైభాగాన ఉండే రైతులకు అవగాహన లోపంతో ఎక్కువ నీటిని వినియోగిస్తారు. దీనివల్ల 20శాతం మంది పల్లపుప్రాంత రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. సాగు దశలో సకాలంలో నీరు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. పైరుకు తడి 75శాతం వరకు తగ్గిపోతే ఆపంటకు నీటి ఎద్దడి ఉన్నట్టు లెక్క. పంటకు అవసరం రాకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణ వాయువు దక్కక నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. నాట్లు వేసేటప్పుడు నీరు పలచగానూ, మొన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యేవరకూ 2సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్టదశ నుంచి గింజ గట్టిపడేవరకు 5సెంటీమీటర్ల నీరు ఉండాలి. ఈనిక, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పదిరోజుల ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువ అయితే పైరు దుబ్బు బాగా చేయదని వ్యవసాయ శాఖ ఏఓ శ్రావణ్ సూచిస్తున్నారు.

రహదారి ఆక్రమణపై కఠిన చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



జేసీబీ సహాయంతో కాలువ ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: రహదారి ఆక్రమణలపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఆక్రమణల కారణంగా వర్షాలకు నీరు రహదారిపై చేరి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అంతేకాకుండా వర్షపునీరు పలు కాలనీల్లో చేరి ముంపు బారిన పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలోని ఆక్రమణలు గుర్తించి తొలగించేదిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఇంటింటి కుళాయి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్



గాదెలవలసలో వేస్తున్న అండర్ గ్రౌండ్ పైప్‌లైన్

సీతానగరం: కోట్లాది రూపాయల వ్యయంతో ప్రజలకు ఇంటింటి కుళాయిల పథకం ద్వారా తాగునీరు సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలో జరుగుతున్న ఇంటింటి కుళాయిల పనులను ఏఈ ఆర్ పవన్ కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటిపేట పంచాయతీలోని మూడు గ్రామాల్లో ఇంటింటి కుళాయిలపనులు పూర్తవడంతో తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. తాజాగా లచ్చయ్యపేట, గాదెలవలస,బూర్జ గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ఇంటింటి కుళాయిలద్వారా తాగునీరు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు బి.అన్నపూర్ణమ్మ, సీహెచ్ కృష్ణ, బి తిరుపతిరావు, సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న ఇళ్లనిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మంజూరుచేసిన పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ ఏఈ జానకీరాం అధ్యక్షతన ఇంజినీరింగ్ సహాయకులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో వందలాదిగా ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడిలేక పోవడం, ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవడం వల్ల ఇళ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. అలాగే గ్రామాల్లో ప్రారంభమైన సచివాలయ భవన నిర్మాణాలు, గడగడపకు మన ప్రభుత్వం నిధులతో మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ సహాయకులు కృషి చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: పర్యాటకంలో భాగంగా ఆడలి వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం నైట్ క్యాంపింగ్ టెంట్లు, భోజన వసతి ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఏజెన్సీ అందాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు ఆడలి వ్యూపాయింట్ వద్ద రాత్రి బస చేసేవారికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. అలాగే సీతంపేటలోని అన్ని పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గైడ్‌గా కూడా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఎంపికలో ఆడలి, సీతంపేట పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 93929 17692, 9493469084కు ఫోన్ చేయాలన్నారు.

భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ దాసు

సీతానగరం: మండలంలోని బూర్జలో జరుగుతున్న సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి వేగవంతం చేయాలని సర్పంచ్ జి దాసు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు స్థానికంగా అందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 11 మంది ఉద్యోగులను నియమించిందన్నారు. వాంతా సక్రమంగా విధులు నిర్వహించడానికి ప్రభుత్వం మంజూరుచేసిన సచివాలయ భవనాన్ని నిర్మించే నిర్వాహకులు లేక పోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయిందన్నారు. ఈ క్రమంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనం నిర్మాణాన్ని స్థానిక గ్రామ పెద్దలు పూర్తి చేయాలని సంకల్పించారన్నారు. నాలుగు రోజులుగా శ్లాబ్, ఇతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే మిగాతా రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్ భవనం పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం చిన్నంనాయుడు, ఎంపీటీసీ జి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడా ఎంపిక పోటీలు

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం జెడ్పీఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్–17 వాలీబాల్, అండర్–14 ఖోఖోతో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన ఎంపిక పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ పోటీల్లో ఎం.సింగుపురం, భాసూరు, చిన్నమంగళాపురం, పాలకొండ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అండర్–17 బాలికల ఖోఖో పోటీల్లో డీఏవీ విద్యార్థులు రాణించారని పీడీ రాకోటి రాములు తెలిపారు. మండల, పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ ఎంపిక పోటీలను గ్రామ సర్పంచ్ రణస్థలం రాంబాబు, ఎంఈఓ సోంబాబు, హెచ్‌ఎం సంగంనాయుడు, క్రీడల నిర్వహణ ఇన్‌చార్జ్ వి.పుష్పనాథం, వై.సురేష్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

హోరాహోరీగా పోటీలు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం అండర్–14 క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, పీఈటీ శివరామప్రసాద్ పర్యవేక్షించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.